క్లుప్తంగా

శీతలాంబదేవతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని శీతలాంబ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాదాలను పంపిణీ చేశారు.

జోరుగా ఉపాధి పనులు


పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. తంగెళ్లపురం చెరువు పూడికతీత పనులను 150 మంది కూలీలు చేస్తున్నారు. ఈ పనులను నెల రోజుల పాటు చేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ హేమలత తెలిపారు. కూలీలకు రోజుకు రూ.200 ఇస్తున్నామని చెప్పారు. సకాలంలో కూలి ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని వికృతమాల వద్ద ఆదివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆప్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొప్పన



వరదయ్యపాళెం: ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వరదయ్యపాళెంకు చెందిన బొప్పన శ్రీనివాసులు నియమితులయ్యారు. తిరుపతిలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మణి నాయుడు ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా బొప్పన శ్రీనివాసులు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మధురెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన జ్ఞానంబవారి మధురెడ్డి ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

తిరుపతి రూరల్: పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-15 ఆధ్వర్యంలో వారం రోజులుగా తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో -ఆర్డినేటర్ ఆచార్య కాత్యాయని, ఈసీఈ కో-ఆర్డినేటర్ మాధవి, ప్రోగ్రామ్ అధికారిణి యువశ్రీ పాల్గొన్నారు. విద్యార్థులు వారం రోజుల పాటు గ్రామంలో పలు అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు చేపట్టడం అభినందనీయమని సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి కొనియాడారు. గ్రామాభివృద్ధికి తోడ్పడేలా ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారుచేయాలని ఈసీఈ విద్యార్థులకు సూచించారు. ఈ శిబిరంలో చురుగ్గా పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామ సచివాలయం వలంటీర్లకు అభినందనలు తెలుపుతూ సర్టిఫికెట్లు అందజేశారు. అంతకుముందు పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సెక్యూరిటీ యాజమాన్యాల సమస్యలపై పోరాటం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని ఏపీ ప్రైవేట్ సెక్యూరిటీ యాజమాన్యాల సమస్యలపై నిరంతర పోరాటాలు చేపడతామని ఏపీపీఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశ్వనాథం, ఎస్.గోపాల్ తెలిపారు. కేటీ రోడ్డులోని బాలాజీ యూఫోరియా కలర్స్ జిమ్ మిద్దపైన ఉన్న సమావేశ మందిరంలో ఆదివారం ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. సెక్యూరిటీ గార్డ్స్ డ్యూటీల్లో పడుతున్న కష్టాలు, పనివేళలపై చర్చించారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లపై యాజమాన్యాలు పడుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు

- జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న ఏర్పేడు విద్యార్థులు
- గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయిలో సత్తా


క్రీడలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ శివకుమార్


ప్రశంసా పత్రాలు, ట్రోఫీని అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

ఏర్పేడు: పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుల్లోనే కాదు.. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. పతకాలు సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు. చదువులతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరచి ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరుప్రతిష్టలను నలుదిశలా వ్యాపింపజేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

2019 నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ఏర్పేడు విద్యార్థులు జాతీయ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిపై ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీడీ శివకుమార్ దృష్టి సారించారు. కబడ్డీ, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇస్తూ వారిలో ప్రతిభకు సానబెడుతున్నారు.

శిక్షణ ఇలా..

ఎంపిక చేసిన విద్యార్థులు తొలుత ఫిట్‌నెస్‌తో ఉండేలా చూస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు క్రీడలను ఆడిస్తున్నారు. ఏ గేమ్‌లో అయితే విద్యార్థి ఎక్కువ ప్రతిభ కనబరుస్తున్నాడో గుర్తించి ఆ ఆటలోనే ప్రధానంగా శిక్షణ ఇస్తున్నారు. వారి ఆటతీరును పరిశీలిస్తూ, లోపాలను సరిచేస్తూ, మెళకువలు నేర్పుతున్నారు. ఇలా శిక్షణతో జాతీయ స్థాయి క్రీడలకు పంపుతారు.

విద్యార్థులు సాధించిన పతకాలు, మెడల్స్

2019లో తిరుపతిలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో షార్ట్‌పుట్ పోటీలో ఫాతిమా బంగారు పతకం, బాబు కాంస్య పతకం సాధించారు.

2020 అక్టోబర్ 29న కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్‌లో దీప, భానురేఖ, పావని మూడవ స్థానాన్ని పొందారు.

2019లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఈశ్వర్ ప్రథమ బహుమతి అందుకున్నాడు.

2019లో విజయవాడలో జరిగిన 65వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో శశికుమార్ ప్రథమ స్థానాన్ని సాధించాడు.

2019లో ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో ఫాతిమా ప్రథమ స్థానం సాధించింది.

చాలా సంతోషం



మా స్కూలు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఫిజికల్ డైరెక్టర్‌తో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.
–సునీత, ప్రధానోపాధ్యాయురాలు, ఏర్పేడు జిల్లా ఉన్నత పాఠశాల, ఏర్పేడు

ప్రత్యేక శిక్షణ



మా స్కూలు విద్యార్థులు ఏ క్రీడలపై అభిరుచి ఉందో గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తాం. భవిష్యత్తులో క్రీడల్లో రాణించేలా చేస్తాం. –శివకుమార్, పీడీ, జెడ్పీ హైస్కూలు, ఏర్పేడు

మంచిగా ప్రోత్సహిస్తున్నారు



నాకు అథ్లెటిక్స్ అంటే ఇష్టం. అలాగే పవర్ లిఫ్టింగ్ కూడా. ఈ పోటీల్లో పతకాలు సాధించాను. బాగా యాక్టివ్‌గా ఉండటానికి క్రీడలు దోహదం చేస్తాయి. మంచిగా ప్రోత్సహిస్తున్నారు. –ఫాతిమా

బంగారు పతకం సాధిస్తా



2019లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచా. జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించడానికి కృషి చేస్తున్నా. – శశికుమార్.

ఆలయ కమిటీ ఎన్నిక


ఆలయ నూతన కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అక్కుర్తి సమీపంలో ఉన్న శ్రీనవకండ అవధూత మూటల మహాలక్ష్మమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పూజారి శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షుడు తిరకాల ఆనంద్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు జూలగంటి గోపీకృష్ణ, గౌరవ ఉపాధ్యక్షుడు జూలుగంటి సుబ్బారావు, వైస్ చైర్మన్ బలరామనాయుడు, గౌరవ సలహాదారులు తాటిపర్తి శంకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కార్యదర్శి అయ్యప్ప, కోశాధికారిగా శ్రీనివాసులను ఎన్నుకున్నారు.

శివయ్య సేవలో చక్రపాణిరెడ్డి


చక్రపాణిరెడ్డి దంపతుల జ్ఞాపిక అందజేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరున్ని శ్రీశైలం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు స్వాగతం పలికి స్వామి అమ్మవారి దర్శనం చేయించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు.

వేడుకగా గురుసంక్రమణ హోమం


పుష్పగిరి మఠంలో హోమ పూజలు, పాల్గొన్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీజయనిధి సేవా సంఘం ఆధ్వర్యంలో తేరువీధిలోని పుష్పగిరి మఠంలో ఆదివారం గురు సంక్రమణ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. నవగ్రహాల్లో పంచమ గ్రహమైన గురు గ్రహం శనివారం రాత్రి 11.30 గంటలకు మీనరాశి నుంచి మేష రాశికి ప్రవేశించింది. ఇందులో భాగంగా పుష్పగిరి మఠంలో గురుగ్రహ సంక్రమణ పూజ, హోమం నిర్వహించారు. ఆ తరువాత శత్రు బాధా నివారణకు, రుణ విమోచనకు హోమం చేశారు. గురు దక్షిణామూర్తికి పాలు, పెరుగు, గంధం, కుంకుమ, సికాయ, పంచామృతంతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పంచ హారతులు ఇచ్చారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హోమ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా వెండితో కూడిన గురుదక్షిణామూర్తి డాలర్‌ను భక్తులకు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీజయనిధి సేవా సంఘం సభ్యులు వరదన్‌స్వామి, నీలకంఠం స్వామి పాల్గొన్నారు.

సిపాయి భరోసా కిట్టు అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

రేణిగుంట: మండలంలోని సూరప్పకశం పంచాయతీ చెంగారెడ్డిపల్లికి చెందిన లక్ష్మీపతి అకాల మరణం చెందడంతో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తన సిపాయి ఫౌండేషన్ ద్వారా ఆదివారం నిత్యావసర సరుకులను అందించారు. 42 వస్తువులతో కూడిన సిపాయి కిట్‌ను బాధిత కుటుంబానికి అందజేసి ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీసీ సామాజికవర్గానికి చెందిన తనపై నమ్మకం ఉంచి జగనన్న ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారని, నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పేద ప్రజలకు రాయితీతో కూడిన వైద్యసేవలను తమ రష్ ఆస్పత్రిలో అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని గెలిపించి మరోసారి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. సర్పంచ్ సుధ పాల్గొన్నారు.

గోసంరక్షణకు రూ. లక్ష విరాళం


ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న సుజిని

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన గోశాలను విజయవాడ వాస్తవ్యులు జి.సుజిని ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు చెక్కు అందించారు. గోసంరక్షణకు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని దాత పేర్కొన్నారు. దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ఘనంగా సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


కాసారం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కాసారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిరత్నం నాయుడు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రధాన పంటకు ముందుగానే కనీసం 18 రకాల నవధాన్యాలను భూమిలో చల్లుకుని వేపుగా పెరిగిన తరువాత భూమిని కలియదున్నుకోడం వల్ల భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పురుగులు, తెగుళ్లను తక్కువ ఖర్చుతో సులభంగా నివారించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాసారం సర్పంచ్ మునెమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రామకృష్ణయ్య, తిరుపాల్, భ్రమరాంబ, రంగయ్య, శాంతి, ధనమ్మ పాల్గొన్నారు.

ప్రపంచ పుస్తక దినోత్సవం


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని ఆమందూరులో ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, రాయడం చేయించారు. చదువుతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఎక్కువగా పుస్తక పఠనం చేయాలన్నారు.

పిచ్చాటూరులో వాన బీభత్సం


పిచ్చాటూరులో రోడ్లపై ప్రవహిస్తున్న నీరు

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఆదివారం సాయంత్రం వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 5 గంటలకు భారీ వర్షంతో పాటు భారీ గాలులు వీచాయి. మామిడి పంట తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు మామిడి రైతులు వాపోయారు. పిచ్చాటూరు, నాగలాపురం రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం కారణంగా సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కేటీరోడ్డు కాళంగి వంతెన, నెరిణికండ్రిగ, తానిగిల్లు, తలారి వెట్టు, కాటూరు, పల్లమాలకండ్రిగ గ్రామాల వద్ద నున్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎస్ ఆకారంలో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయా గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న నేతలు

కేవీబీపురం: పిడుగుపాటుతో మృత్యువాత పడిన పశువుల కాపరి వెంకటేష్ కుటుంబానికి తిరుపతికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు ఆరె అజయ్‌కుమార్ ఆదివారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బొగ్గుల వెంకటేష్ శుక్రవారం పిడుగు పాటుకు మృతిచెందిన విషయం విధితమే. నాయకులు సురేష్, హేమా యాదవ్, మురళి, చెంచుకృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


రామాపురంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం


మంత్రి పెద్దిరెడ్డి దంపతులకు ప్రసాదాలు అందజేత

పిచ్చాటూరు: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి ఆదివారం పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సరుటపల్లి పళ్లికొండేశ్వరస్వామి ఆలయం సహా పలు దేవాలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వారి వెంట సురుటపల్లి ఆలయ చైర్మన్ బాలాజీరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.

జింకను కాపాడిన స్థానికులు



శ్రీరంగరాజపురం : పాడుబడిన బావిలో పడిన జింకను గ్రామస్తులు కాపాడిన సంఘటన వెలుగు చూసింది. మండలంలోని పద్మాపురం గ్రామంలో ఉన్న ఓ పాడుబడిన బావిలోకి పుల్లూరు అటవీప్రాంతం నుంచి వచ్చిన జింక దారి తెలియక శనివారం రాత్రి అదుపుతప్పి పడిపోయింది. ఆదివారం ఉదయం జింక బావిలో పడిన విషయాన్ని గుర్తించిన స్థానికులు దారం సాయంతో జింకను సురక్షితంగా రక్షించారు. సమాచారం అందుకున్న కార్వేటి నగరం అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని జింకను స్వాధీనం చేసుకున్నారు. జింకను కాపాడిన స్థానికులను అధికారులు అభినందించారు. అనంతరం జింకకు ప్రథమ చికిత్స చేసి కార్వేటినగరం కుమ్మయ్యగుంట అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

వినాయకుని సేవలో కలెక్టర్


కలెక్టర్, కుటుంబసభ్యులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కలెక్టర్ వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబసమేతంగా కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీ పరిధిలోని సుద్ద మిట్ట గిరిజన కాలనీ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే పొలాల్లోని విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, వైర్ల ఎత్తు పెంచాలని రైతులు కోరుతున్నారు.


తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌వైర్లు